

పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి.. కన్నీటి వీడ్కోలు

శెట్టిగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బావమరదలు మృతి చెందారు. వారి మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. - 8లో



వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.180	రూ.240

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 964 మెట్రిక్ టన్నులు



కూలిన బతుకులు

రెక్కాడితే డొక్కాడని బతుకులు వారివి..రోజూ కూలిపనికి వెళ్తేనే నాలుగు వేళ్లు నోట్లోకి వెళతాయి. వారి కుటుంబ జీవనం గడుస్తుంది. అలాంటి వారిపై విధి చిన్న చూపు చూసింది.రోడ్డుప్రమాద రూపంలో తొమ్మిదిమందిని బలి తీసుకుంది. పలువురిని ఆసుపత్రిపాలు చేసింది.వారిని నమ్ముకున్న కుటుంబాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. 'ఎంతపని చేశావు దేవుడా' అంటూ వారు గుండెలవిసేలా రోదించారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయామంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

- రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద లారీ బోల్తా
- 9 మంది కూలీల మృతి
- 13మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు తీరని శోకం



ప్రమాదానికి కారణమైన వాహనం

సాక్షి రాయచోటి/ ఓబులవారిపల్లె/ పుల్లంపేట/ రాజంపేట : రాజంపేట ఇసుకపల్లి గ్రామం నుంచి మామిడికాయలు తీసుకు వెళ్తున్న ఐచర్ వాహనం రెడ్డిపల్లి చెరువు కట్టపై బోల్తా కొట్టడంతో 9 మంది కూలీలు మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు శెట్టిగుంట ఎస్టీ కాలనీ గ్రామానికి చెందిన దాదాపు 22 మంది కూలీలు ఆదివారం ఐచర్ వాహనంలో మామిడికాయలు కోతకు రాజంపేట మండలంలోని మందరం వెళ్లారు. సాయంత్రం మామిడికాయలు లోడ్ చేసుకొని తిరుగు ప్రయాణంలో లారీపై ఎక్కి కూర్చున్నారు. లారీ రెడ్డి పల్లి చెరువు కట్ట సమీపానికి రాగానే ఎదురుగా వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి అదుపు చేయలేక బోల్తా పడింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు.మరొకరు మార్గమధ్యలో మృతి చెందారు. 13మంది గాయపడ్డారు. బోల్తా పడిన లారీని అతి కష్టం మీద క్రేన్ సాయంతో పోలీసులు పక్కకు తీశారు.గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఎన్.వెంకటేశు, జి.పోలమ్మ, పి. రామయ్య, జి.శ్రీనివాసులు, పి.వెంకటేశు, వి.వి జయలక్ష్మి, వి.గంగోత్రి ఉన్నారు.వీరికి చికిత్స అందజేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ పీవీఎస్ రాజు తెలిపారు.మృతుల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు.

మృతి చెందిన వారు : గజ్జల దుర్గయ్య, సుబ్బరత్నమ్మ, గజ్జల వెంకటేశు,గజ్జల శీను, చిట్టెమ్మ, గజ్జల లక్ష్మీదేవి,రాధ, గజ్జల రమణ, వెంకట సుబ్బమ్మ.

శెట్టిగుంట ఎస్టీ కాలనీలో విషాదం

శెట్టిగుంట ఎస్టీ కాలనీలో విషాదం అలుముకుంది. కూలికిపోయిన వారిపై విధి చిన్నచూపు చూడటంతో ఒకేసారి ఇంతమంది చనిపోవడం ఈ ప్రాంతంలో ఇదే ప్రథమం.కూలి కోసం పగలంతా కష్టపడి రాత్రికి ఇంటికి వస్తున్నవారిపై అనుకోని ప్రమాదం ప్రాణాలను తీసింది. ఇందులో 9మంది చనిపోవడంతోపాటు పలువురు గాయపడటంతో కాలనీతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విషాదం అలుముకుంది.



ప్రమాదస్థలం

పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డ చిన్నారులు

ఊహించని ప్రమాదంతో కూలీలు అల్లకల్లోలమయ్యారు. ఆదివారం కావడం. అందునా ఇంటి దగ్గర ఉంటే ఆలనాపాలనా ఎవరు చూస్తారో తెలియక తమతో పాటు పిల్లలను వెంట తీసుకెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మామిడి కాయలను లారీలో లోడ్ చేసుకొని వస్తున్న సమయంలో పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద ప్రమాదం సంభవించింది. లారీపైన కూర్చొని ప్రయాణిస్తున్న వారిలో తొమ్మిది మంది మృత్యువాత పడగా మరో 13 మందికి గాయాలయ్యాయి. అయితే క్యాబిన్ లోపల ఉన్న ఇద్దరు చిన్నారులు గంగోత్రి,చంచిత ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ బోల్తా పడటంతో చిన్నారులు బోరున విలపించారు. పెద్ద ప్రమాదంలో చిన్నారులు బయటపడటం దేవుడి దయేనంటూ పలువురు పేర్కొంటున్నారు.







ప్రమాదంలో బయటపడిన చిన్నారులు



సహాయక చర్యల్లో ఏఎస్పీ హెగ్డే, పోలీసులు



గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళుతున్న దృశ్యం



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అన్నమయ్య జలాశయం పరిశీలన

రాజంపేట : అన్నమయ్య జలాశయాన్ని నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. ప్రధానంగా జలాశయం ప్రస్తుత స్థితి గతులపై అంచనా వేసింది. ఈ బృందంలో డిజైన్ ఎక్స్‌ఫర్ట్‌గా పీపీఏ చీఫ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌ఫర్ట్‌గా రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కే.సత్యనారాయణ, జియాలిజిస్టుగా జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్(రిటైర్డ్) ఎం.రాజు, డిజైన్ అప్రూవింగ్ అథారిటీ గా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, డబ్ల్యూఆర్‌డీ చీఫ్ ఇంజినీర్, హైడ్రాలజీ ఎక్స్‌ఫర్ట్‌గా విజయవాడకు చెందిన హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్, కన్వీనర్‌గా కడప డబ్ల్యూఆర్‌డీ చీఫ్ ఇంజినీర్లు ఉన్నారు. ప్రభుత్వం అన్నమయ్య జలాశయం డిజైన్ చేసేందుకు సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపించింది. జలాశయం పునర్నిర్మాణానికి సంబంధించి డిజైన్, నిర్మాణం తదితర అంశాలపై టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ దృష్టి సారించింది. కార్యక్రమంలో అన్నమయ్య జలాశయం అధికారులు పాల్గొన్నారు.



అన్నమయ్య జలాశయం వద్ద నిపుణుల బృందం

న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.


గంగమ్మా..కాపాడవమ్మా..



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె : గంగమ్మ దేవతా కరుణించి కాపాడు తల్లీ అంటూ అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు ఆదివారంప్రత్యేక పూజలు నిర్వహించా రు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి రా వ డం తో క్యూ లైన్ల ద్వారా అమ్మవారి దర్శనం కల్పించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోణాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు.

హార్సిలీహిల్స్‌తో 'కోట'కు అనుబంధం



'ఎన్‌కౌంటర్' చిత్రీకరణలో కోట శ్రీనివాసరావు

బి.కొత్తకోట : విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ తో అనుబంధం ఉంది. సూపర్ స్టార్ కృష్ణ నటించిన ఎన్‌కౌంటర్ సినిమా షూటింగ్ ఇక్కడ జరగ్గా ఆ సినిమాలో మంత్రి మహాంకాళీ పాత్రలో నటించిన కోట కీలకమైన సన్నివేశాల చిత్రీకరణకు హార్సిలీ హిల్స్ వచ్చారు. కొన్ని రోజులు ఇక్కడ విడిది చేసి షూటింగ్ లో పాల్గొన్నారు. ఆ తర్వాత పోలీస్ రిపోర్ట్ సినిమా షూటింగ్‌కు వచ్చారు. ఈ షూటింగ్ సందర్భంగా ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపిన వారు మీడియాతో కోట శ్రీనివాసరావు సరదాగా జోకులు వేయడాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

చక్రస్నానం..సర్వపాపహరణం

ఘనంగా సౌమ్యనాథుడికి చక్రస్నానం

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగుతున్నాయి. ఇందులో చివరిఘట్టమైన చక్రస్నానం ఆదివారం వైభవంగా నిర్వహిచారు. ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడికి గ్రామోత్సవం.. వసంతోత్సవాల నడుమ జరిగింది. ఆలయంలో ఉత్సవమూర్తులకు గంధం, పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు ఉత్సవమూర్తులకు కోనేటిలో చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానం అనేది బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనది. కోనేటిలో స్వామి స్నానం ఆచరించిన తర్వాత మునిగిన వారి పాపాలు తొలగుతాయని, మోక్షం లభిస్తుందని పండితులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.



కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి వారికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

మేనిఫెస్టోపై సమరం!

- ఊరురా బాబు షూరిటీ..మోసం గ్యారెంటీపై విస్తృత ప్రచారం
- శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి రాయచోటి : కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా..హామీల అమలుకు అడుగులు పడటం లేదు. ఏదేదో చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. తాత్కాలిక ఉపశమనం కోసం అరకొరగా ఒకటి, రెండు హామీల అమలుకు శ్రీకారం చుట్టినా అవికూడా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. అనేక ఆంక్షలకు తెరతీసి అర్హులైన అనేక మంది లబ్ధిదారులను దగా చేస్తున్నారు. సూపర్ సిక్స్‌లోనే అమలు చేయాల్సిన హామీలు ఉండగా, బహిరంగసభల్లో, మేనిఫెస్టోలో చెప్పిన అనేక హామీలకు ఇంకా దిక్కు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైంది. ఇప్పటికే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వంపై పోరుబాట సంకల్పించిన వైఎస్సార్ సీపీ విద్యుత్ పోరు, యువత పోరు, ఫీజు పోరు, తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రజల్లోకి దూసుకెళ్లింది. మరోవైపు హామీలను అమలు చేయని నేపథ్యంలో చంద్రబాబుపై రీకాల్ కోరుతోంది.

మోసంపై పోరుబాట

చంద్రబాబు సర్కార్ అధికారాన్ని చేపట్టి ఏడాది దాటినా హామీలు అమలుకు అడుగులు పడలేదు. దీంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పార్టీ సమన్వయకర్తల సమావేశంలో చంద్రబాబు మేనిఫెస్టో అమలుకు నోచుకోకపోవడంపై రీకాల్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాయచోటి, తంబళ్లపల్లె పీలేరు, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించి కార్యకర్తలు, శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. దీంతో ఇప్పుడు ఎక్కడచూసినా ప్రజల్లో కూడా మేనిఫెస్టో రీకాల్‌పై చర్చ జరుగుతోంది.

శ్రేణులకు దిశా నిర్దేశం

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ముందుగానే సమావేశాలు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ క్యాడర్‌తో పాటు శ్రేణులకు, నాయకులను కార్యోన్ముఖులను చేస్తున్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను అమలు చేయని వైనంపై నేతలు దిశా నిర్దేశం చేస్తున్నారు. దీంతో కార్యకర్తలు, శ్రేణులుకూడా ఎక్కడికక్కడ మేనిఫెస్టోపై రీకాల్ ఉద్యమంపై ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీకి సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు కె.సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్,మాజీ ఎమ్మెల్సీ తిప్పారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో శ్రేణులు మేనిఫెస్టోపై రీకాల్ కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాయి. ప్రతి నియోజకవర్గంలో క్యూఆర్ స్టిక్కర్ల ఆవిష్కరణ మొదలుకొని పార్టీలోని కింది క్యాడర్ నుంచి పెద్ద నాయకుల వరకు ప్రభుత్వంపై పోరాటంలో భాగస్వాములు అవుతున్నాయి. ఏదిఏమైనా కూటమి సర్కార్‌పై వైఎస్సార్ సీపీ చేపట్టిన మేనిఫెస్టోపై రీకాల్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది.

క్లుప్తంగా

రైలులో నుంచి పడి వృద్ధుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన కదిరప్ప

మదనపల్లె రూరల్ : రైలులో నుంచి ప్రమాదవశాత్తు పడి వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. కర్ణాటకలోని కోలారుజిల్లా బాగేపల్లె తాలూకా బోపనపల్లె క్రాస్ కాలనీకి చెందిన చిన్నవెంకట నరసప్ప కుమారుడు టి.కదిరప్ప (65) నెలరోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేసి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్లే ప్యాసింజర్ రైలులో ప్రయాణిస్తుండగా, బాత్‌రూమ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తూ.. రైలు డోరు వైపు వెళ్లడంతో కురబలకోట బ్రిడ్జి వద్ద జారి కిందకు పడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వేహెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా నిందితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కడప పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



సమగ్రశిక్ష రాష్ట్ర స్థాయి పోర్టల్‌లో ముద్రించిన సాయిపేట ఆదర్శ పాఠశాల ముఖచిత్రం

కడప ఎడ్యుకేషన్ : కడప నగర పాలక సంస్థ పరిధిలోని సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ నెల 10వ తేదీన నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ (మెగా పీటీఎం 2.0) సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంబంధించిన ఫొటో ఫ్రేమ్ రూపకల్పనలో పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం లభించింది. దీనికి సంబంధించి సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర పోర్టల్‌లో ముఖచిత్రంగా ఏర్పాటు చేశారు. దీంతోపాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల ఫొటో చిత్రాన్ని తన స్టేటస్‌తోపాటు సామాజిక మాధ్యమాల్లో ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాది నాగరాజుతోపాటు ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికల్లో కడప జిల్లాకు చెందిన పూర్వజ రెడ్డి అండర్–15, 17 విభాగాలలో సింగిల్స్ విజేతగా నిలిచి సత్తాను చాటినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు జిలానీ బాషా తెలిపారు. ఆదివారం నగరంలోని డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–15 బాలుర విభాగంలో ప్రొద్దుటూరుకు చెందిన క్రీడాకారులు రాణించి మొత్తం జిల్లా జట్టులోని స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 15 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారన్నారు. అండర్–15, 17 విభాగాలలో జరిగిన ఈ ఎంపికలో బాలబాలికలకు విడివిడిగా సింగిల్స్, డబుల్స్‌లో పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్ సభ్యులు గంగాధర్, నాగరాజు డాక్టర్ ప్రతాప్ రెడ్డి, విశ్వనాథరెడ్డి జ్ఞాపికలను అందజేశారు.

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్ 15 బాలురు జట్టు – డి.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, చంద్రకిషోర్, పీబీజీ వర్షిత్ (ప్రొద్దుటూరు). **అండర్ 15 బాలికల జట్టు** – ఎల్.పూర్వజరెడ్డి, బి.హారిణి, రితిక, కావ్య (కడప). **అండర్ 17 బాలుర జట్టు** – వేద వ్యాస్ వర్మ, ఎల్ సుప్రీత్‌రెడ్డి (కడప) సి.విశ్వతేజ (ప్రొద్దుటూరు). **అండర్ 17 బాలికల జట్టు**–రమ్యశ్రీ (ప్రొద్దుటూరు) ఎల్.పూర్వజ, కావ్య, రితిక (కడప).

పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి..
కన్నీటి వీడ్కోలు

త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి.. కన్నీటి వీడ్కోలు పలికారు. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బావమరదలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఆర్తనాదాలు మిన్నంటాయి. 'మీ పెళ్లి చేసి మురిసిపోదామనుకుంటే.. ఇలా జరిగిందేమిటి!'.. దేవుడా అంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు విషాద వదనంలో మునిగిపోయారు.



సాయికృష్ణ, అనిత (ఫైల్)

- రైల్వేకోడూరు రోడ్డు ప్రమాద మృతులకు ఘన నివాళి
- రెండు నెలల్లో వివాహం.. అంతలోనే మృత్యు ఒడికి
- మరణంలోనూ ఒక్కటై..
- శోక సముద్రంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

ఓబులవారిపల్లె : చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు. యుక్త వయస్సు రాగానే ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి వివాహానికి సిద్ధమయ్యారు. రెండు నెలల్లో పెళ్లి.. అంతలోనే మృత్యుఒడికి చేరుకున్నారు. మరణంలోనూ వారు ఒకరికొకరు తోడుగా వెళ్లిపోయారు. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి విషాద గాథ ఇది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని వైకోట రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ కండక్టర్ వనమాల శ్రీనివాసులు, వనమాల ప్రభావతికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు అజయ్ కృష్ణ, చిన్న కుమారుడు సాయి కృష్ణ. పెద్ద కుమారుడు అజయ్ చిట్వేలి గ్రామానికి చెందిన సాతుపాడి నాగయ్య నాల్గవ కుమార్తె మాధవిని వివాహం చేసుకున్నాడు. మాధవి తల్లిదండ్రులు ఇద్దరూ అప్పటికే చనిపోయి ఉండటంతో.. తన చిన్న చెల్లెలు అనితను చిన్నప్పుడే తనతోపాటు అత్తగారింటికి తీసుకొచ్చింది. అనిత ఇక్కడే హైస్కూల్‌లో చదివి పుల్లంపేటలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. నవమాల శ్రీనివాసులు రెండవ కుమారుడు సాయి కృష్ణ డిగ్రీ వరకు చదివాడు. చిప్పప్పటి నుంచి సాయి కృష్ణ, అనిత ఇద్దరూ కలిసి పెరగడంతో వారి మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలు మొదట్లో ఒప్పుకోకపోయినా.. తర్వాత ఒప్పించి వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంకా రెండు నెలలకు అనిత మైనార్టీ తీరిన తరువాత వివాహం చేద్దామని పెద్దలు నిర్ణయించుకొని అన్ని సిద్ధం చేసుకున్నారు.


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

కబళించిన రోడ్డు ప్రమాదం

ఈ క్రమంలో విధి వీరి జీవితాలతో ఆడుకుంది. సాయికృష్ణ (24)కు రైల్వేకోడూరు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఇటీవల ఉద్యోగం వచ్చింది. చేరేందుకు స్కూటీపై శనివారం రైల్వేకోడూరుకు వెళ్లాడు. అక్కడ ఉండేవారు తిరుపతికి వెళ్లాలని చెప్పడంతో తిరుపతికి వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న మరదలు అనిత నంద్యాల డెమో రైలులో తిరుపతికి వెళ్లింది. ఇద్దరు కలిసి తిరుపతిలో ఉంటున్న అజయ్ కృష్ణతో మాట్లాడారు. సాయంత్రం అనిత, సాయికృష్ణ స్కూటీపై తిరుపతి నుంచి ఇంటికి బయలు దేరారు. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట సమీపానికి రాగానే.. వేగంగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఇద్దరిపై నుంచి లారీ వెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఓబులవారిపల్లిలోని ఆస్పత్రిలో ఆదివారం ఉదయం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలిసి మెలిసి మంచి వాడు అన్న పేరు ఉన్న సాయికృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహాలను సర్పంచ్ ఎన్‌పీ జయపాల్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


సంఘటన స్థలంలోనే మృతి చెందిన బావమరదలు

ఇదేం ప్రయాణం.. ప్రాణాలకే ప్రమాదం

ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ మార్గంలో ఆదివారం ఐదుగురు యువకులు ఒకే బైక్‌పై ఓవర్ స్పీడుగా వెళ్లడం ఆశ్చర్యాన్ని కల్గించింది. వీరి రైడింగ్ భయ భ్రాంతులకు గురి చేసింది. వంద కిలోమీటర్ల వేగంతో.. సౌండ్ చేస్తూ.. ఆపై గోల చేస్తూ వెళ్లారు. బైక్ ఏమాత్రం అదుపు తప్పినా.. వారి ప్రాణాలకే ప్రమాదమనే సంగతిని వారు మరిచిపోయారు. ఇది అన్నమయ్య జిల్లాలో వైరల్‌గానే కాకుండా హల్‌చల్‌గా మారింది. ఈ విషయమై ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌ను వివరణ అడగగా.. వీరి కోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు. తగు చర్యలు తీసుకుంటామన్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకుంటామన్నారు.

– కురబలకోట



సెయింట్ లూయిస్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి

- 2007లో వైఎస్సార్ మాట్లాడిన పబ్లిక్ మీటింగ్ వేదికపైనే వేడుకలు


వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న యూఎస్‌ఏ వైఎస్సార్ అభిమానులు, నాయకులు

రాజంపేట : యూఎస్‌ఏలోని సెయింట్ లూయిస్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఆయన మాటల్లోని మానవతాస్ఫూర్తి గురించి కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు మాట్లాడారు. వారి జీవితాల్లో వైఎస్సార్ ప్రభావం గురించి, వ్యక్తిగత అనుభవాలను హృద్యంగా పంచుకున్నారు. గతంలో 2007లో వైఎస్సార్ సెయింట్ లూయిస్ పర్యటనలో ఇదే కన్వెన్షన్ హాల్‌లో పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడారని ప్రవాసాంధ్రులు గుర్తు చేసుకున్నారు. అదే వేదికపై ఆయన జ్ఞాపకాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, కడప మోహన్‌రెడ్డి తమ మధుర జ్ఞాపకాలను, వైఎస్సార్ జీవితంలో చిరస్మరణీయ ఘట్టాలను పంచుకున్నారు. వైఎస్సార్ జయంతి సభ వీక్ ఎండ్స్‌లో చేయాల్సి వచ్చిందన్నారు. చికాగో, మెంఫిస్, కాన్సాస్ వంటి నగరాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారన్నారు. సభలో కన్వీనర్ సుబ్బారెడ్డి, పమ్మి, సందీప్, రాఘవరెడ్డి, నవీన్, గూడువల్లి, మహేష్, గోపాల్, తాటిపర్తి, ఆర్కే తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

- 112కు కాల్ చేసిన భార్య శశికళ
- పోలీసుల అదుపులో నిందితుడు

మదనపల్లె రూరల్ : కత్తితో భార్య, ఆమె కుటుంబ సభ్యులపై భర్త హత్యాయత్నానికి పాల్పడగా, బాధితురాలు 112కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ శానిటోరియం తురకపల్లెకు చెందిన శశికళకు, కలికిరి నాయనిచెరువుపల్లెకు చెందిన రెడ్డిప్రకాష్‌తో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి స్వప్న(11), ప్రఖ్య(9) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెడ్డిప్రకాష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భర్త వ్యసనాలు, వేధింపులు భరించలేక కొంత కాలం క్రితం శశికళ భర్తను వదిలేసి పుట్టింటికి వచ్చేసింది. విడాకులు కోరుతూ కోర్టులో కేసు వేసింది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం రెడ్డిప్రకాష్ ఆమెపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆ ఘటనపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పది రోజుల క్రితం శశికళ తండ్రి మృతి చెందడంతో.. ఆదివారం దశదినకర్మలో భాగంగా ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ప్రార్థనలు చేసుకుంటుండగా, హఠాత్తుగా రెడ్డిప్రకాష్ కత్తి తీసుకుని అక్కడికి వచ్చారు. భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించాడు. దాడిలో శశికళ స్వల్పంగా గాయపడగా, కుటుంబసభ్యులు దాడిని అడ్డుకున్నారు. దీంతో అక్కడి నుంచి రెడ్డిప్రకాష్ పారిపోయాడు. వెంటనే బాధితురాలు 112కు కాల్ చేసి హత్యాయత్నం ఘటనపై ఫిర్యాదు చేసింది. దీంతో తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి బయలుదేరగా, అప్పటికే అక్కడి నుంచి తప్పించుకున్న రెడ్డిప్రకాష్ .. పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం తాగుతున్నట్లు తెలుసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శశికళ తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, హత్యాయత్నం ఘటనపై ఫిర్యాదు చేసింది. భర్త నుంచి ప్రాణహాని ఉందని తెలిపింది.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం


స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువు దీర్చి బంగారు ఆభరణాలు, వర్ణమైన పుష్పమాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు విశ్వసేన పూజ, కలశ ప్రతిష్ట, కలశపూజ, వాసుదేవ పుణ్యాహ వచనం, కుంకుమపూజ, యజ్ఞోపవీత ధారణ, మధుపర్కం పట్టు వస్త్ర సమర్పణ, కన్యాదానం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, అక్షతరూపణ, మాలమార్పిడి, వారణమయి మహానివేదనం, కర్పూర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఒంటిమిట్ట సమీప ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఒంటిమిట్ట మండల ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎంపీపీ లక్ష్మీదేవి దంపతులు, అర్చకులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమష్టి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాబన్

ఒంటిమిట్ట : హక్కుల సాధనకు సమష్టి పోరాటం చేయాలని నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాబన్ తెలిపారు. ఆదివారం ఒంటిమిట్ట మండలంలోని హరిత కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గుటూరు రాజా, జిల్లా అధ్యక్షులు సుంకేశుల బాషా అధ్యక్షతన నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపల్లికి చెందిన సుబాన్ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ బాబన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో దూదేకులకు రూ.100 కోట్లతో కూడిన నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు, హైకోర్టులో ఉన్న 4.5 శాతం రిజర్వేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దూదేకులు తమ పిల్లల టీసీల్లో ఇండియన్ ఇస్లామ్ పేరుతో సర్టిఫికెట్లు తీసుకోవాలని తెలిపారు. నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీర్ మహమ్మద్ మాట్లాడుతూ దూదేకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని తెలిపారు. నూర్ బాషా –దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, దూదేకుల సంఘం నాయకులు ప్రొద్దుటూరుకు చెందిన నాగూర్, కడప బుజ్జి, రిటైర్డ్ ఎంపీఓ కులాయప్ప మాట్లాడారు.

అనంతరం జిల్లా యువజన అధ్యక్షులుగా కడప నగరానికి చెందిన నరసింహ కుమార్, ఒంటిమిట్ట మండల అధ్యక్షులు ఇస్మాయిల్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్నమయ్య, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, నంద్యాల, గుంటూరు, విజయవాడ తదితర జిల్లాలకు చెందిన దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు, కడప జిల్లాకు చెందిన సంఘం నాయకులు, రిటైర్డ్ ఎస్‌ఐ కుళాయప్ప, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్, రాచపల్లి మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, పగడాల దస్తగిరి, గగ్గుటూరి మౌలాలి, మస్తాన్, బాబయ్యతోపాటు వందలాది మంది సభ్యులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి


అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి ఊరేగింపు

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అశ్వవాహనంపై శ్రీ చెన్నకేశవస్వామి దర్శనమిచ్చారు. అలాగే శ్రీ సిద్దేశ్వరస్వామికి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామ వీధుల్లో భక్తులు స్వామివార్లకు కాయకర్పూరం సమర్పించుకున్నారు. పార్వేటి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

నేడు ధ్వజావరోహణం

శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలకు సోమవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించనున్నారు. సిద్దేశ్వరునికి త్రిశూలస్నానం, శ్రీ చెన్నకేశవస్వామికి చక్రస్నాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అపరకాశి.. తాళ్లపాక

అపరకాశి తాళ్లపాక అని హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ అన్నారు. తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తాళ్లపాక స్థలపురాణం, అన్నమాచార్యుల జీవితం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. జిల్లా ప్రోగ్రాం గోపిబాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ధార్మిక ఉపన్యాసకులు కందిమల్లు రాజారెడ్డి అన్నమయ్య జీవిచరిత్ర విశేషాలపై ప్రసంగించారు.

రాజకీయంగా కక్ష సాధింపు

- తప్పుడు కేసు నమోదు
- చౌక దుకాణం డీలర్ ఆవేదన

రాయచోటి : అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో విజిలెన్స్ అధికారులు తనపై తప్పుడు పెట్టారని రేషన్ షాపు డీలర్ మల్లికార్జున వాపోయారు. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామంలోని చౌకదుకాణం (నంబర్ 1147001)ను ఆయన నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మల్లికార్జున ఆదివారం విలేకరులతో తన గోడు వెల్లబోసుకున్నారు. గతంలో డీలర్ షాపులో సరుకుల విషయంలో అవకతవకలు జరిగాయని 6 ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గత కొద్ది రోజుల కిందట డీలర్ షాప్‌ను అధికారులు పరిశీలించి, అన్నీ సక్రమంగా వున్నాయని తెలుసుకొన్న తర్వాత స్టాక్ అందజేసినట్లు తెలిపారు. రెండు రోజుల కిందట విజిలెన్స్ అధికారులు వచ్చి స్టాక్‌లో అవకతవకలు వున్నాయని, మీ పై కేసు నమోదు చేశామని, సంతకాలు చేయండని తమపై ఒత్తి తెచ్చారని పేర్కొన్నారు. తాను సంతకాలకు నిరాకరించడంతో తమపై రాజకీయ కక్ష సాధింపునకు గురి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తపుడు కేసులను తొలగించాలని కోరుతున్నానని తెలిపారు.

మద్యం తాగవద్దన్నందుకు ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

మదనపల్లె రూరల్ : మద్యం తాగవద్దన్నందుకు మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. సీటీఎం పంచాయతీ పడమటవీధికి చెందిన రాజయ్య(62) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. కొంత కాలంగా మద్యానికి తీవ్రంగా బానిసై ప్రతి రోజు ఇంటికి మద్యం తాగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం మరోసారి ఉదయాన్నే మద్యం తాగి రావడంతో.. భార్య రాజమ్మ భర్తతో గొడవపడి మద్యం తాగవద్దంటూ మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రాజయ్య ఇంటికి సమీపంలోనే ముష్టిచెక్క తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

డబ్బు బాకీ ఉన్నారని దంపతులపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : డబ్బు బాకీ ఉన్నారని ఇంట్లోకి చొరబడి ఇద్దరు హిజ్రాలతోపాటు మరి కొందరు వ్యక్తులు దంపతులపై దాడికి పాల్పడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈశ్వరరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న గైబూసా బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని భార్య హబీబున్నీసా డబ్బు బాకీ ఉందనే కారణంతో.. వదిన అయిన గౌషియా కొన్ని రోజులుగా ఆమెతో గొడవ పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 11న గౌషియాతోపాటు కుమారుడు, కుమార్తె, ఇద్దరు హిజ్రాలతో కలసి హబీబున్నీసా ఇంటికి వెళ్లారు. డబ్బు ఇస్తారా లేదా అని గొడవ పడి ఇంట్లోని వస్తువులన్నీ పగులగొట్టారు. దాడి చేయడంతో గైబూసా దంపతులు గాయపడ్డారు. అంతటితో ఆగక కబోర్డును పగులకొట్టి అందులో ఉన్న 150 గ్రాముల బంగారును తీసుకెళ్లారు. ఇంటి బయట నిలిపిన రెండు బైక్‌లను కూడా తీసుకెళ్లారు. ఈ విషయమై గైబూసా శనివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు రాత్రి పొద్దుపోయాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులోని నిందితులు గౌషియా, ఆమె కుమారుడు కరీం, ఇద్దరు హిజ్రాలు రాజారెడ్డి, శ్యామలను ఆదివారం అరెస్ట్ చేశారు.

చెరిపితే చెరిగేది కాదు.. జగనన్న మార్కు..

- 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బాబు ఒక్క పథకాన్నైనా తెచ్చారా?
- రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు గౌరీరెడ్డి



రాయచోటి : రాష్ట్ర రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కు.. చెరిపితే, చెరిగిపోయేది కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో సొంతంగా ఒక్క పథకాన్ని కూడా చంద్రబాబు నాయుడు తీసుకురాలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన అమ్మఒడిని తన కుమారుడు లోకేష్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటన్నారు. పేరెంట్స్ మీటింగ్‌లో సీఎం హోదాలో చంద్రబాబు మొత్తం అబద్ధాలు చెప్పారని విమర్శించారు. అమ్మఒడి పథకం ఎవరు తెచ్చారన్నది రాష్ట్రంలో చిన్నపిల్లలను అడిగినా చెబుతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం తడబడకుండా అబద్ధాలు ఆడగలరన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి రావటం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసినా ఏ నాడు విద్యావ్యవస్థపై దృష్టి పెట్టకపోగా.. సత్యమే పలకవలెనని నేర్పించే పాఠశాలలకు వెళ్లి పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న రీతిలో చంద్రబాబు ప్రవర్తన ఉందన్నారు. 2017లో వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో చెప్పిన మాట ప్రకారం తొలి ఏడాదిలోనే అమ్మఒడి ద్వారా తల్లులకు డబ్బులు అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. అయితే ఏడాది డబ్బులను అనేక మంది తల్లులకు ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుదన్నారు. మనబడి, నాడు నేడు పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసింది కూడా జగన్ ప్రభుత్వంలోనే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం, డిజిటల్ విద్యా రంగాన్ని ప్రారంభించింది జగనన్న అన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన నాణ్యత లేని బ్యాగ్, నాసిరకం భోజనంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న గోరు ముద్ద పథకాన్ని కూటమి ప్రభుత్వం ఘోరమైన ముద్దగా మార్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జగనన్న పథకాలను ప్రజలు జీవితకాలం మరచిపోరని ఆమె వివరించారు.

మున్సిపల్ వాటర్, విద్యుత్ సిబ్బంది సమ్మె బాట


సమ్మె బాట పట్టిన మున్సిపల్ వాటర్, విద్యుత్ ఇంజినీరింగ్ సిబ్బంది

రాయచోటి టౌన్ : గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన మున్సిపల్, విద్యుత్ శాఖ (ఇంజినీరింగ్)ల సిబ్బంది శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమ్మెబాట కార్యక్రమం ప్రారంభించారు. మొదటి రోజు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామాంజులు సమ్మెలో పాల్గొన్న వారికి పూలమాల వేసి దీక్షలు ప్రారంభించారు. అలాగే మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణతో కలసి ఆటో ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత నెల రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని, జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని ముట్లు ఇవ్వాలని, రక్షణ పరికరాలు అందివ్వాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కార మార్గం చూపలేదన్నారు. అందుకే సమ్మె బాట పట్టామని తెలిపారు. మెప్మా ఆర్‌పీలకు, ట్రైబల్ టీచర్స్, గెస్ట్ టీచర్స్‌కు జీతాలు పెంచారు కానీ 2005 నాటి నుంచి నేటి వరకు దాదాపు 20 సంవత్సరాలు పూర్తి కావస్తోందని, కేవలం రూ.15 వేలు వస్తోందని వీటిలో కటింగ్‌లు పోను రూ.13 వేలు మాత్రమే చేతికి వస్తోందన్నారు. ఇక వెలిగల్లు ప్రాజెక్టు పంప్ హౌస్‌లో పని చేస్తున్న ఆరుగురికి 14 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దీనిపై కోర్టు జీతాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. పెడచెవిన పట్టారని ఆరోపించారు. ఏడు సంవత్సరాల నుంచి ఇంజినీరింగ్ సిబ్బంది జీతాల పెంపునకు నోచుకోలేదన్నారు. జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు పెంచేదాకా నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది అక్బర్, శంకరయ్య, ఈశ్వరరెడ్డి, మల్లిఖార్జున, రమణ, రమేష్, రమాదేవి, వెంకటలక్ష్మి, మౌనిక, దేవా, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.